ఉపాధ్యాయులకు భోజనాలు
విద్యార్థులకు ఛార్జీలు

సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 27 : ఇటీవల వెటర్నరీ వర్సిటీ టీచింగ్ సిబ్బందికి రాష్ట్ర స్థాయి క్రీడలు రాజేంద్రనగర్‌లో జరుగగా పీవీ నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ సమీపంలోని హాస్టల్లో భోజన వసతులు కల్పించారు. టీచర్స్ కోటాలో నుంచి నిధులు ఖర్చు పెట్టకుండా ఆ ఖర్చులు తమపై ఎందుకు వేశారని సంబంధిత అధికారులను విద్యార్థి నాయకులు అడుగగా.. ఉపాధ్యాయులకు తిండి పెట్టే స్థోమత మీకు లేదా అంటూ హేళనగా మాట్లాడారని దీనిపై అనవసరంగా చర్చ పెడుతే.. మీపై వేటు తప్పదని హెచ్చరించినట్లు పలువురు విద్యార్థి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వీసీ అందుబాటులో లేకపోవడంతో సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు ఉమేష్ చంద్ర, సాయి సూర్య, శివ యాదవ్, కార్తీక్ ,హరీష్ తదితరులు ఉన్నారు.

కొత్వాల్‌గూడలో అదనపు
తరగతి గదులు ప్రారంభం

కొత్వాల్‌గూడలో అదనపు తరగతి గదులను ప్రారంభించిన సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్, మార్చి 27 : శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ ప్రాథమికొన్నత పాఠశాలలో రౌడ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన అదనపు గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదుల కొరత ఉండడంతో అదనపు గదుల నిర్మాణం చేయాలని కోరడంతో స్పందించిన సంస్థ మూడు అదనపు గదులతో పాటు మూత్రశాలలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఈవో రాంరెడ్డి, సంస్థ ప్రతినిధులు గౌరవ్‌గార్గ్,నాగలక్ష్మి,శ్రీవైతన్య,అఖిల్,మాజీ కౌన్సిలర్ లక్ష్మి,శ్రీనివాస్‌గౌడ్, లింగంయాదవ్, గుంటి ప్రవీణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు..ఆక్రమణలు కనిపిస్తలేవా.!

పెద్దతాళ్లకుంట పార్కు ముఖద్వారం, చెరువు స్థలంలో నిర్మాణమవుతున్న అపార్ట్‌మెంట్‌లు

పెద్దతాళ్లకుంట చెరువు స్థలంలో
వెలుస్తున్న అపార్ట్‌మెంట్‌లు...
ఎఫ్‌టీఎల్, బఫర్ స్థలంలో నిర్మాణాలు

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27: పార్కులు, ప్రభుత్వ స్థలాలను అక్రమార్కులు ఆక్రమించి దర్జాగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. అత్తాపూర్ డివిజన్ పెద్ద తాళ్లకుంట చెరువు, పార్కు స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. పార్కు కోసం ప్రహరీ గోడను నిర్మిస్తే దానిని సైతం కూల్చివేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. బడాబాబులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని స్థలాలను ఆక్రమించుకొని అపార్ట్‌మెంట్‌లను నిర్మిస్తున్నారు. భూకబ్జాదారులు కుంటలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలను కాజేస్తూ నకిలీ దస్తావేజులు సృష్టించుకొని రిజిస్ట్రేషన్లు చేసుకుంటు నిర్మాణాలు చేపడుతున్నారు. కొన్నిటికి అధికారులు అనుమతులు ఇవ్వకపోయినా కొన్ని రోజులు పనులను నిలిపి వేసి తిరిగి నిర్మాణాలను చేస్తున్నారు. వీటిని అమాయక ప్రజలకు విక్రయిస్తూ కోట్ల రూపాయలు అర్జిస్తున్నారు.

పేదలపైనే ప్రతాపం...

మూసీ పరీవాహక ప్రాంతాలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చేందుకు సిద్ధమవుతుంది కానీ కోట్ల రూపాయల విలువ చేసే చెరువులు, కుంటల స్థలాలను ఆక్రమించి పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లు నిర్మించిన వాటిపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పేదలకు ఓ న్యాయం, బడాబాబులకు ఓ న్యాయం అన్నట్లు ప్రభుత్వ తీరు స్పష్టమవుతుంది.
ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువులు, కుంటలు, పార్కు స్థలాలను ఆక్రమించి వెలుస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

హామీలు అమలు చేయకుండా...దాడులా..!
సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్

హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారి తొండుపల్లి వద్ద రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ, సీపీఎం నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 27 : కార్మికులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ విమర్శించారు. రెండు రోజుల క్రితం ఆశవర్కర్ల సమస్యలను పరిష్కారం చేయాలని ఆందోళన చేసిన వారిని పోలీసులతో ఇష్టం వచ్చినట్లు దాడి చేయించడమే కాకుండా సీఐటీయూ, ఆశవర్కర్లను అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం శంషాబాద్ మున్సిపాలిటీలోని తొండుపల్లి వద్ద హైదరాబాద్– బెంగళూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.కార్యక్రమం లో సీపీఎం జిల్లా నాయకుడు రుద్రకుమార్, మండల సీపీఎం కన్వీనర్ కేవై ప్రణయ్,ఆశవర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి సునీత, సీఐటీయూ జిల్లా నాయకుడు మల్లేష్‌లతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

2న బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 27: ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌లు పిలుపునిచ్చారు. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అమలు చేస్తున్నట్లు అసెంబ్లీలో చట్టం చేసి పార్లమెంట్‌కు పంపించిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో కూడా 9వ షెడ్యూల్‌లో చట్టం చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న అన్ని బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో పోరు గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2 న దేశ రాజధాని ఢిల్లీలో సర్వాయిపాపన్న 315వ వర్ధంతిని కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఉదయం 7గంటలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని, బీసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పోరు గర్జనలో రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌తో పాటు అన్నిపార్టీల ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్ కుమార్‌గౌడ్, బాలగౌని వెంకటేశ్‌గౌడ్, సుగూరి దుర్గయ్య గౌడ్, నాగభూషణం, సింగం నాగేశ్‌గౌడ్, పోతగాని అయిలేని గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఐటీలో నిర్వాణ -25 ప్రారంభం

మణికొండ, మార్చి 27 :గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో బుధవారం కళాశాల వార్షికోత్సవం నిర్వాణ –25 ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. చంద్ర మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సుధాకర్ రెడ్డి కలిసి ప్రారంభించిన విషయం విదితమే. ఇందులో భాగంగా మొదటి రోజు నిర్వహించిన '24 గంటల జాతీయస్థాయి హ్యాక్‌తాన్ – హ్యాక్ సావి 25' లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ నేటి సమాజం ఎదుర్కొంటున్న వివిధ రకాల సాంకేతిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనేలా కృషి చేయాలని సూచించారు. యువత సాంకేతికంగా ఎంతో చురుకుగా ఉంటున్నారని దానిని సమాజంతో పాటు దేశ శ్రేయస్సు కోసం వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ రంగాలకు చెందిన అంశాలలో పోటీ నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, రోబోటిక్స్, సస్టైనబుల్ ఇన్‌ఫ్రా ,ఓపెన్ ఇన్నోవేషన్ వంటి అంశాలలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి సుమారు 1100కి పైగా ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొని వారి ప్రతిభను కనబరిచారు. ఈ హ్యకతాన్ రెండవ రోజైన నేడు ముగిసింది. ముగింపు కార్యక్రమంలో 13 మంది హ్యాక్సావి''25 విజేతలకు రెండు లక్షల యాభై వేలు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో 'నిర్వాణ' 25 వైస్ చైర్మన్ డాక్టర్ వి. వెంకట రామయ్య, హ్యాక్సావి''25 కన్వీనర్ డాక్టర్ సీఆర్ కే రెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి,డాక్టర్ రమాబాయి, వివిధ విభాగాల అధిపతులు , కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం జరిగిన క్రీడా దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ వి. కామాక్షి ప్రసాదు మాట్లాడుతూ 2047 నాటికి దేశాన్ని స్వావలంబన , సంపన్న ఆర్థిక వ్యవస్థగా మారాలంటే యువత ముఖ్యపాత్ర పోషించాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన యోగా గురువు, జాతీయ వాలీబాల్ క్రీడాకారిని డాక్టర్ కె. అరుణాదేవి ప్రసంగిస్తూ, ఒత్తిడిని నివారించడానికి విద్యార్థులందరూ ప్రతిరోజూ యోగాభ్యాసం చేయాలన్నారు.

శంషాబాద్ పట్టణంలో.. ఇఫ్తార్ విందు

ఇఫ్తార్ విందులతో ఆప్యాయత వెల్లివిరుస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం శంషాబాద్ పట్టణంలో మైనార్టీ నాయకుడు సయ్యద్ రఫీయుద్దీన్ భాబ్రీ ఆధ్వర్యంలో వైఎన్ఆర్‌గార్డెన్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ప్రతి ఒక్కరూ తనకు ఉన్నదాంట్లో సహాయం చేయడం దేవుడు ఇచ్చిన గొప్పవరమని కొనియాడారు. కార్యక్రమంలో శంషాబాద్ మాజీ సర్పంచ్ గణేష్‌గుప్త, వెంకటేశ్‌గౌడ్, జాంగీర్‌ఖాన్, ఆయిలేకు మార్, మేకల వెంకటేశ్, అజయ్ పాల్గొన్నారు.– శంషాబాద్ రూరల్

ఎంఈ, ఎంటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటె క్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

లక్ష్మీనగర్ కాలనీలో..కానరాని మౌలిక వసతులు

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ, మార్చి 27 : మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు గుడ్ మార్నింగ్ మణికొండ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురువారం లక్ష్మీనగర్ కాలనీలో నిర్వహించారు. గ్రేటర్ మహానగరంలో నివాసముంటున్న ప్రజల కన్నా అధికంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నివాసముంటున్న ప్రజలు ఆస్తి పనులను చెల్లిస్తున్నామని అయినా మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని లక్ష్మీనగర్ కాలనీవాసులు నాయకుల ముందు వాపోయారు. రోడ్లు, మంచి నీరు లేకపోవడం, ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నామని కాలనీవాసులు నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేని కారణంగా వర్షాకాలంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రోడ్డు నంబర్ 9లో ఉన్న ఇండ్లను వర్షపు నీరు ముంచెత్తుతున్నదని వచ్చే వర్షాకాలంలోపు డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీతారాం ధూళిపాళ, కుంభగల్ల ధనరాజ్, గుట్టమీది నరేందర్, సంగం శ్రీకాంత్,గోరుకంటి విఠల్, దిలీప్, కిరణ్ యాలాల, రాజేంద్ర ప్రసాద్, బాను చందర్, సుమనళిని, బొడ్డు శ్రీధర్, బాలాజీ, తిరుపతి, నారాయణ రాజు, బంగారు బాబు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని ఆధునిక పద్ధతిలో తీర్చిదిద్దాలి

పచ్చ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బండ్లగూడ, మార్చి 27. రాజేంద్రనగర్ లోని గ్రంథాలయాన్ని అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. గురువారం రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న లైబ్రేరియన్ పచ్చ శ్రీనివాసును గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రంథా లయానికి వచ్చే విద్యార్థుల కోసం మరిన్ని పుస్తకాలను ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు ఆధునిక పద్ధతిలో విద్యను నేర్చుకునేందుకు కంప్యూటర్లు కూడా ఏర్పాటు చేయాలని వారు పచ్చ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డు వద్ద గొడవ
మధురానగర్ పోలీసుస్టేషన్‌లో
కేసు నమోదు

వెంగళరావునగర్, మార్చి 27 : స్వల్ప వివాదం చినికి చినికి గాలివానలా మారింది. పార్కింగ్ చేయొద్దన్నందుకు అక్కడ విధుల్లో ఉన్న సూపర్‌వైజర్‌తో పాటు సెక్యూరిటీ గార్డ్‌పై దాడులకు పాల్పడ్డారు చెత్త డంపింగ్ చేసే ఆటో డ్రైవర్లు. దాడిలో గాయపడిన ఇద్దరిని చికిత్స కోసం దవాఖానాకు తరలించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్క్ పక్కన డంపింగ్ యార్డ్ ఉంది. డంపింగ్ కోసం వచ్చే ఆటోలను లోపల పార్కింగ్ చేసి నింపొద్దని డంపింగ్ యార్డ్ ఇన్‌ఛార్జి లక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. రంగన్న అనే వ్యక్తి ఆటోను లోపల పార్కింగ్ చేయడంతో విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డ్ (శ్రీనాథ్ ఆటోను బయటకు తీసుకెళ్లాలని కోరాడు. ఇక్కడే ఆటోని పార్కింగ్ చేస్తానని రంగన్న అనడంతో ..టైర్లలో గాలి తీసేస్తానని సెక్యూరిటీ గార్డ్ శ్రీనాథ్ అనడంతో గొడవ పెద్దదైంది. ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి.సెక్యూరిటీ గార్డ్ శ్రీనాథ్‌తో పాటు..అక్కడ విధుల్లో ఉన్న సూపర్ వైజర్ జగదీష్ రెడ్డిపై దాడికి పాల్పడ్డారు. దీంతో మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'కేంద్రప్రభుత్వం కులగణన చేపట్టాలి'

హిమాయత్ నగర్, మార్చి 27: దేశ వ్యాప్తంగా కులగణన చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనంజయ నాయుడు డిమాండ్ చేశారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభాలో 56 శాతంగా ఉన్న బీసీలకు బీసీ మంత్రిత్వ శాఖ లేకపోవడం వల్ల విద్య, ఆర్థిక రంగాల్లో బీసీలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కులగణనపై రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని కోరారు.

ఎస్ఆర్‌నగర్‌లో
యువతి ఆత్మహత్య

శశికళ (ఫైల్)

వెంగళరావునగర్, మార్చి 27: గదిలో ఎవరు లేని సమయంలో జీవితంపై విరక్తి చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి ఎస్ఆర్టీ కాలనీలో గురువారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఇన్స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పెరుమాళ్ల శశికళ(24) రెండు సంవత్సరాల క్రితం నగరానికి వచ్చి కూకట్‌పల్లిలోని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ అనే బ్యాంక్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఇక్కడ సరిగ్గా వసతులు లేకపోవడంతో 3 నెలల క్రితం ఎస్.ఆర్.నగర్‌కు వచ్చి ఓ అద్దె గదిలో ఆమె స్నేహితురాలు రమాదేవితో కలిసి ఉంటున్నారు. రమాదేవి ఉదయాన్నే బ్యాంకుకు వెళ్లిపోగా శశికళ గదిలోనే ఉంది. శశికళకు మిత్రుడైన ఓ యువకుడు రమాదేవికి ఫోన్ చేసి గదిలో శశికళ బాధపడుతూ తనకు ఫోన్ చేసిందని, గదికి వెళ్లి చూడాలని చెప్పాడు. దీంతో రమాదేవి హుటాహుటిన వారు ఉంటున్న గదికి వచ్చి చూడగా లోపలి నుంచి గడియ పెట్టుకున్న శశికళ సీలింగ్ ఫ్యాన్కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది.
దీంతో రమాదేవి పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శశి కళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే.. క్రిమినల్ కేసులు
హైడ్రా కమిషనర్ రంగనాథ్

తొండుపల్లిలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, తహసీల్దార్ రవీందర్ దత్, తదితరులు

శంషాబాద్ రూరల్, మార్చి 27 : ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. మున్సిపాలిటీలోని తొండుపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఆ భూముల పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 109ను ఆనుకొని ఉన్న ప్రైవేటు భూమిలో ఎలాంటి అనుమతిలేకుండా వెంచర్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా వెంచర్‌కు ప్రభుత్వ భూమిని పార్కుగా చూపించిన వెంచర్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. చెరువు అలుగును ముసివేసిన వెంచర్ నిర్వాహకులపై చర్యలు తప్పవన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేసి హైడ్రా పరిధిలోకి తీసుకుంటామని తెలిపారు.
దీంతో పాటు మరో సర్వే నంబర్ 108లో 10 ఎకరాల ప్రభుత్వ భూమి శ్మశాన వాటికను కొందరు కబ్జా చేసి హోర్డింగ్ బోర్డులు ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ధర్మోజికుంట చెరువు బఫర్‌జోన్ ఆక్రమించి ప్రహరీగోడ నిర్మాణం చేశారు. వాటిపై చర్యలు తీసుకున్నారా అని మీడియా ప్రతినిధులు అగిడిన ప్రశ్నకు వెంటనే సీఐ తిరుమలేష్‌గౌడ్ ఆ ప్రహరీగోడను కూల్చివేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. ప్రభుత్వ భూములను పరిశీలించిన వారిలో తహసీల్దార్ రవీందర్ దత్, మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుతో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

కలుషిత నీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలి

బండ్లగూడలోని కాలనీలో కలుషిత నీటిని పరిశీలిస్తున్న బీజేఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావుల కోళ్ల నాగరాజు

బండ్లగూడ, మార్చి 27: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు పలు కాలనీల్లో పర్యటించి మంచినీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీవాసులు కలుషిత నీటిని చూపిస్తూ కొన్ని రోజులుగా తమకు ఇలాంటి నీళ్లు సరఫరా అవుతున్నట్లు ఆయనకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలకు పోయి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. హిమాయత్ సాగర్ నుంచి బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు మంచినీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం సంతోషకరమైనప్పటికీ ఆ నీటిని శుద్ధి చేసే విషయంలో తగు చర్యలు తీసుకోకపోవడంతో బండ్లగూడలో కలిషితనీరు కలకలం రేపుతుందనారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని నీటి శుద్ధి యంత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మంచినీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్తిపన్ను చెల్లించని దుకాణాలు సీజ్

గడువులోపు ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా హెచ్చరించారు. గురువారం యూసుఫ్‌గూడ వెంకటగిరిలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆస్తిపన్ను బకాయి ఉన్న దుకాణాలను సీజ్ చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఏఎంసీ కమల్, బీసీలు, టీబిలతో పాటు ఎస్ఎఫ్ ఏ సంతోష్ తదితరులు పాల్గొన్నారు. – జూబ్లీహిల్స్,మార్చి 27

14 రోజుల పసికందును
చంపిన తల్లి రిమాండ్

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 27: పుట్టిన బిడ్డను పోషించే స్థోమత లేకపోవడంతో తల్లే తన 14 రోజుల పాపను నీటి బకిట్‌లో వేసి చంపింది. నిందితురాలిని పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం తమిళనాడు ప్రాంతానికి చెందిన ముదిలాని మణి, ఆరోగ్య విజ్జి (30) భార్యాభర్తలు. వీరికి ఒక బాబు , 14 రోజుల కూతురు సంతానం. అలీన గర్‌లోని ఓ కంపెనీలో పని చేస్తూ అక్కడే ఉంటున్నారు. భర్త రెండు కిడ్నీలు పాడవ్వడంతో అతడి చికిత్స నిమిత్తం డబ్బు లు చాలా ఖర్చు అయిపోయాయి. వీరి ఆర్థిక స్థోమత సరిగ్గా లేకపోవడంతో పుట్టిన పాపను ఎలా చూసుకుంటామనే ఆందోళనలో ఆరోగ్య విజ్జి సతమతమవుతుంది. ఈ నెల 25న ఉదయం 11 గంటల ప్రాంతంలో భర్త పనికి వెళ్లిన సమయంలో భార్య ఆరోగ్య విజ్జి కూతురును బాత్‌రూమ్‌లోని నీటి బకెట్‌లో పడేసి హత్య చేసింది. అనంతరం కూతు రు కనిపించడం లేదని నటించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి హత్య చేసింది తల్లే అని నిర్ధారించారు. గురువారం నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మంచినీటి పైపులైన్ పనుల పరిశీలన

కాచిగూడ: స్థానిక ప్రజల సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా అన్నారు. డివిజన్‌లోని రహమత్ బాగ్‌బస్తీలో మంచినీటి పైప్‌లైన్ పగిలిపోయింది. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన కార్పొరేటర్ పైపులైన్ పనులను జలమండలి అధికారులతో చేయించారు.

నార్సింగిలో
గృహిణి ఆత్మహత్య

మణికొండ, మార్చి 27 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహితురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే... సబితా రాయ్‌కర్మాకర్, శుభజిత్ రాయ్ కర్మాకర్ భార్యాభర్తలు. తమ ఇద్దరు కుమారులతో కలిసి రెండు మాసాల క్రితం నార్సింగికి వచ్చి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వెనకాల ఓ ఇంట్లో అద్దెకుంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం శుభజిత్ పని కోసం బయటికి వెళ్లారు. తన భార్య సబితా రాయ్(27) కుమారుడు అన్ష (4) ఇంట్లోనే ఉన్నారు. అనంతరం సబితారాయ్ గదిలోకి వెళ్లి ఇనుపరాడుకు టవాల్‌తో ఉరి వేసుకొని ఆత్మహ